క్లుప్తంగా

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: మండల కేంద్రంలో శివాని బసప్ప అనే వ్యక్తి మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి.. స్థానిక నాయకులతో బాధిత కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 వేలు అందజేశారు. ఇందులో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీటీసీ ఆనందం, ఎల్లయ్య ఉన్నారు.

అర్హులకు అందని దళితబంధు

మర్పల్లి: దళితబంధు పథకం అర్హులకు అందడం లేదని జేఏఆర్టీఐ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవివర్మ ఆరోపించారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు తొలి విడతలో మంజూరైన యూనిట్లు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే అందాయని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి మొదటి విడతలో జరిగిన పథకం దుర్వినియోగాన్ని పరిశీలిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. రెండో విడతలో అయినా నిజమైన లబ్ధిదారులకు దళితబంధు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రచారం షురూ..



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: ఎన్నికల కోడ్ అనంతరం రాజకీయ పార్టీలు ప్రచారం మొదలు పెట్టాయి. మంగళవారం మండల పరిధి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వెంకట్రావు ఆధ్వర్యంలో.. నాయకులు, కార్యకర్తలు పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంల గురించి ఓటర్లకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని కోరారు.

కూలీలకు ఉపాధి.. చెట్లకు రక్షణ



గడ్డి కోస్తున్న ఉపాధి కూలీలు

మోమిన్‌పేట: రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు రక్షణ కల్పించేందుకు వాటి చుట్టూ ఏపుగా పెరిగిన గడ్డిని ఉపాధి కూలీలతో తొలగిస్తున్నారు. వేసవిలో మొక్క చుట్టూ గడ్డి ఉండటంతో అగ్ని ప్రమాదాలు జరిగి మొక్కలు, చెట్లు సైతం బుగ్గిపాలవుతుండటంతో ముందు జాగ్రత్తగా గడ్డిని కోపిస్తున్నారు. దీని వలన చెట్లకు రక్షణ కల్పించడంతో పాటు.. కూలీలకు ఉపాధి కల్పించట్లయిందని పలువురు అన్నారు.

'ఛత్రపతి' యాత్రకు ఘన స్వాగతం



పట్టణ వీధుల్లో కొనసాగుతున్న రథయాత్ర

అనంతగిరి: ఛత్రపతి శివాజీ హిందూ పద పద షాహిగా పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శివాజీ స్ఫూర్తి కేంద్రం శ్రీశైలం వారి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారథ యాత్ర కొనసాగుతోంది. ఈ యాత్ర ఈ నెల 8న జోగులాంబ అలంపూర్ శక్తిపీఠం నుంచి ప్రారంభం అయింది. మంగళవారం సాయంత్రం వికారాబాద్‌కు చేరుకోగా.. రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు చరణ్ రెడ్డి, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉద్యోగమేళాకు స్పందన

బొంరాస్‌పేట: కమిట్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల ఉద్యోగమేళాకు స్పందన లభించింది. విద్యావంతులైన దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మేళా నిర్వహించినట్లు ఎంపీఎస్ కోఆర్డినేటర్ చంద్రప్ప తెలిపారు. 35మంది దరఖాస్తులు అందజేయగా.. 15మంది ఎంపికయ్యారని చెప్పారు. వైకల్యాన్ని బట్టి అవకాశం కల్పించి, వారికి హైదరాబాద్‌లో ఉచిత వసతి, భోజనం కల్పించి శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు.

బీఆర్ఎస్‌కు ఎంపీటీసీ రాజీనామా

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలం దుద్యాల–2 ఎంపీటీసీ సభ్యుడు ఎల్లప్ప బీఆర్ఎస్ పార్టీకి, పదవికి మంగళవారం రాజీనామా చేశారు. వ్యక్తి గత కారణాల వలనే తప్పుకుంటున్నట్లు అధికారులకు, పార్టీ నియోజకవర్గ నేత పట్నం నరేందర్‌రెడ్డికి రాజీనామ లేఖను పంపించారు.

పత్తికి తెగులు.. రైతన్నకు దిగులు



మొరంగపల్లిలో ఎండాకు తెగులు సోకిన పత్తి

- అనుకూలించని వాతావరణం
- లోపించిన ఎదుగుదల
- ఎండాకుతో తెర్లయిన తెల్లబంగారం
- పెట్టుబడులు రావంటూ రైతుల ఆందోళన

మోమిన్‌పేట: వానాకాలం సీజన్ తెల్ల బంగారం సాగు.. ఈ సారి రైతన్నకు కలిసి రాలేదు. అనుకూలమైన వాతవరణం లేక పత్తి ఎదుగుదల లోపించింది. ఈ సీజన్‌లో ఒక నెలలో వాన దంచి కొట్టడం.. మరో నెలలో ఎండలు ప్రతాపం చూపడంతో పత్తి సాగుపై తీవ్ర ప్రభావం పడింది. దానికి తోడు ఎండాకు తెగులు సోకడంతో అన్నదాతలు దిగాలు పడిపోయారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావంటూ వాపోతున్నారు. జూన్‌లో వర్షాలు లేక జులైలో పత్తి విత్తనాలు విత్తారు. మొలక ఉన్నప్పుడే నెల రోజుల పాటు ఏకధాటి వర్షాలు కురువడంతో మొలక ఎదగలేకపోయింది. ఆగస్టులో ఎండలు, సెప్టెంబరులో 25రోజులు వానలు పడ్డాయి. ప్రస్తుతం పక్షం రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో పంట పెరగడం లేదు. దీంతో గూడ, పిందె లేక పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాదని ఆవేదన చెందుతున్నారు. ఎరువులు, విత్తనాలు, కలుపు తీత, మందుల పిచికారీకి పెట్టిన పెట్టుబడి ఎక్కువగానే అయింది.

80శాతం సాగు..

ఎండాకు తెగులు సోకడంతో కాసిన 10 కాయలలో విత్తులు రావని, ఏ విధంగా చూసినా పత్తి సాగు చేసిన మాకు ఇబ్బంది తప్పేట్టు లేదని అన్నదాతలు ఆందోళన వ్యకం చేస్తున్నారు. జూన్‌లో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను క్వింటాలుకు రూ.7,020లు ప్రకటించడంతో ఉత్సాహంగా సాగుకు సన్నద్ధమైన రైతన్నలు.. ఇప్పుడు దిగాలు చెందుతున్నారు. మండల పరిధి గ్రామాల్లో రైతులు 80శాతం పత్తిని సాగు చేశారు. మొక్కజొన్న సాగుకు అడవి పందుల బెడద ఉండటంతో పత్తి సాగుకు మొగ్గు చూపారు. సుమారుగా 18వేల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఆశించిన స్థాయిలో పంట ఎదుగుదల లేకపోవడం, ఎండాకు తెగులు సోకడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.30 వేలకు పైగానే ఖర్చుచేసినట్లు రైతులు తెలిపారు.

కౌలుకు తీసుకొని సాగు..



ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తిని సాగు చేశా. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో పంటలో ఎదుగుదల లోపించింది. కౌలుతో కలుపుకొని రూ.2 లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టాను. 10కాయల కంటే ఎక్కువ లేవు. 15 రోజులుగా వర్షాలు లేవు. ప్రస్తుత పంటకు వానలు చాలా అవసరం. ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేక దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది.

– ఆనందం, కౌలురైతు, ఎన్కేపల్లి



చంద్రకల్ శివారులో పోలీసుల తనిఖీ

సరిహద్దున వాహనాల సోదా

దౌల్తాబాద్: ఎన్నికల నియమావళి నేపథ్యంలో సరిహద్దు ప్రాంత్రమైన చంద్రకల్ గ్రామంలో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేసిన అనంతరం ప్రవేశానికి అనుమతిస్తున్నారు. రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం, డబ్బు, మారణాయుధాలు సరఫరా కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమించరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వీరశైవ లింగాయత్ లింగబలిజ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన లింగబలిజ నాయకులు హైదరాబాద్‌లో ఈశ్వరప్పను మర్యాదపూర్వకంగా కలిసి నిర్మాణంలో ఉన్న శివాలయం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సహాయసహకారాలు ఉంటాయని చెప్పారు. అనంతరం ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేశారు.



ఈశ్వరప్పను కలిసిన మండల నాయకులు

మహనీయుల కృషి ఆదర్శనీయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మహనీయుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల: సమాజమార్పునకు మహనీయుల కృషి మరువలేనిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధి రేగడిఘనాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ వ్యక్తి కాదు.. శక్తి అన్నారు. ఆయన భిక్ష వల్లే ఈ రోజు మేము మీ ముందు మాట్లాడగలుగుతున్నామని చెప్పారు. దేశంలో హరిత విప్లవం, వ్యవసాయాన్ని ఆధునీకీకరించడంలో బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సహకారం అనితర సాధ్యమైనవి అన్నారు. వారి చరిత్రలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం ఆటపాటలతో అలరించారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు సహకరించిన దాతలు మాజీ సర్పంచ్ రాంరెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకుడు రాంబాబు, కాంగ్రెస్ నేత పామెన భీంభరత్ తదితరులకు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.నర్సింహులు, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ పి.నారాయణ, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, మార్కెట్‌కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తిప్పని వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు రాంబాబు, రాములు, ఆలిండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, నరహరిరెడ్డి, నాయకులు గిరధర్‌రెడ్డి, ప్రభాకర్, యాదిరెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, నర్సింహులు, శ్యాం, జంగయ్య, నాగార్జున్‌రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్, మద్దెల శ్రీనివాస్, సుశాంత్ పాల్గొన్నారు.

ఎంబీ రికార్డు చేయొద్దని వినతి

మొయినాబాద్: దాతల ఆర్థిక సహకారంతో నిర్మించిన యూజీడీ పనులకు ఎంబీ రికార్డు చేయవద్దని కాశీంబౌలి గ్రామస్తులు పంచాయతీ రాజ్ ఏఈ ఆశాజ్యోతికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని కాశీంబౌలి గ్రామంలో యూజీడీ పనులు చేపట్టాలని గత నెల 21న పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి పనులను సుధాకర్‌రెడ్డికి అప్పగించారు. అతను పనులు చేయకపోవడంతో గ్రామస్తులు, వ్యవసాయ క్షేత్రాల యజమానులు నిధులు పోగు చేసుకుని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. దాతల సహకారంతో చేసిన పనులకు పంచాయతీ నిధులు డ్రా చేసేందుకు ఎంబీ చేయించే అవకాశం ఉందని.. ఎట్టి పరిస్థితుల్లో ఎంబీ రికార్డు చేయవద్దని ఏఈకి విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, పెంటారెడ్డి, భూపాల్‌రెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి, శశిధర్‌రెడ్డి, మహిపాల్ తదితరులు ఉన్నారు.



పంచాయతీ రాజ్ ఏఈ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న కాశీంబౌలి గ్రామస్తులు

కృషి ఉంటే విజయాలు వెన్నంటే

శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. యువసైనిక్ డిఫెన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు పోలీసు, ఆర్మీ ఉద్యోగాలను సాధించారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం ఏసీపీ కార్యాలయంలో డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎదగాలనే ఆలోచనతో ముందుకు సాగాలని అన్నారు. నిబద్ధతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కోచ్ గిరిని అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి, టీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పేరుగొప్ప.. ఊరుదిబ్బ

- కర్మాగారాలతో కళకళలాడుతున్న తాండూరు
- కార్మికుల సంక్షేమం పట్టని పాలకులు
- ఎన్నికల హామీలకే పరిమితమైన ఈఎస్ఐ
- ప్రమాదం జరిగితే పొరుగు రాష్ట్రానికి పరుగు



నాపరాతి గనుల్లో పని చేస్తున్న కార్మికులు

మూడు సిమెంటు కర్మాగారాలు, వందలాది నాపరాతి గనులతో పారిశ్రామిక ప్రాంతంగా పేరుగాంచిన తాండూరు ప్రాంతం.. పెరుగొప్పగానే మిగిలిపోయింది. ఈ కంపెనీల్లో వేలాది కార్మికులు షిప్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నా.. ఏదైనా ప్రమాదం జరిగితే.. మెరుగైన చికిత్సకోసం పొరుగు రాష్ట్రానికి పరుగు పెట్టాల్సిన దుస్థితి. దీన్నే ఆసరాగా తీసుకున్న రాజకీయ నాయకులు ఇదిగో ఈఎస్ఐ అంటూ.. ఎన్నికల ఏరుదాటగానే తెడ్డుతగలేస్తున్న వైనంపై 'సాక్షి' కథనం..

తాండూరు రూరల్: తాండూరు మండలంలో మూడు సిమెంట్ కర్మాగారాలతో పాటు వందల సంఖ్యలో నాప రాతి గనులు ఉన్నాయి. ఇందులో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. స్థానికంగా ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో.. కార్మికులు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చికిత్సల కోసం వెళ్తుండగా.. దీనినే అవకాశంగా మలుచుకున్న రాజకీయ నాయకులు సాధారణ ఎన్నికల సమయంలో ఈఎస్ఐ దవాఖాన ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుంటున్నారని, కానీ ఇచ్చిన మాటా నిలబెట్టుకోవటం లేదని పలువురు కార్మికులు విమర్శిస్తున్నారు.



కరన్‌కోట్‌లోని సీసీఐ కర్మాగారం

ఈఎస్ఐ డబ్బులు కట్

కరన్‌కోట్‌లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), బెల్కటూర్‌లో పెన్నా, మల్కాపూర్ శివారులో ఇండియా సిమెంట్ (ఐసీఎల్)సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. దీంతో పాటు కర్ణాటక సరిహద్దులోని కల్లూరి వద్ద చెట్టినాడు, జట్టూరు వద్ద సాగర్ సిమెంట్ కంపెనీలు ఉండగా.. వాటిల్లో వేలాది సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారు. వీరి వేతనం నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ పేరిట కొంత మేర రుసుం యాజమాన్యం కోతపెడుతుందని, కానీ తాండూరులో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో వైద్య చికిత్స కోసం ఇబ్బంది పడుతున్నామని కార్మికులు చెప్పారు.

ఎన్నికల అనంతరం ఆస్పత్రి ఊసేలేదు

ఓగిపూర్, మల్కాపూర్, కోటబాసుపల్లి శివారులో అనేక నాపరాతి గనులు ఉండగా.. వాటిల్లో వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారు. నాపరాతి కటింగ్‌తో పాటు లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తుంటారు. గనుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే.. స్థానికంగా ఈఎస్ఐ లేకపోవడంతో కార్మికులు మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రంతో పాటు.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో కొందరు కార్మికులు మాట్లాడారు. ప్రతి సారి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాండూరులో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మిస్తామని ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నాయకులు హామీ ఇస్తున్నారని, ఎన్నికలు ముగియగానే.. ఆసుపత్రి గురించి ఒక్కరూ మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దవాఖానా నిర్మించాలి



కర్మాగారాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే.. చికిత్స కోసం యాజమాన్యం బాధిత కార్మికులను పొరుగు రాష్ట్రంతో పాటు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. పరిస్థితి విషమించితే కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. ఈఎస్ఐ ఆసుపత్రి కోసం అనేకసార్లు పోరాటం చేశాం. అయినా ఫలితం లేదు. నాయకులు స్పందించి తాండూరులో ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేయాలి.

– శరుణప్ప, ఏఐటీయూసీ నాయకుడు, కరన్‌కోట్

తప్పుడు ప్రచారం మంచిది కాదు

మర్పల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ జిల్లా మజ్దూర్ సెల్ కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి ఖండించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా మల్లేశ్‌యాదవ్ కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఈ విశయమై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరు హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని శ్రీశైల పీఠాధిపతి, సన్యాసి సంఘం అధ్యక్షుడు కల్యానంద స్వామీజీ అన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా గద్వాల జోగులాంబ జిల్లాలోని అలంపూర్ జోగులాంబ ఆలయ నుంచి ప్రారంభమైన రథయాత్ర మంగళవారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, బీజేపీ శ్రేణులు రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. చౌడమ్మ గుట్ట హనుమాన్ ఆలయం నుంచి జీహెచ్ఆర్ మైదానం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలువురు పీఠాధిపతులు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏకైక హిందూ దేశం భారతదేశం అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. శివాజీ పోరాటం మనకు స్ఫూర్తిదాయకమన్నారు.

అవినీతి సర్కార్‌కు చరమ గీతం

- వైఎస్సార్ పాలనను తిరిగి తెస్తాం
- రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

బంట్వారం: తెలంగాణలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నాటి సంక్షేమ పాలన తీసుకువస్తామని, మాయ మాటలు చెప్పే కేసీఆర్‌ను గద్దె దించాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. హాత్‌సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం ఆయన కోట్‌పల్లి మండలం బీరోల్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ఆయన ప్రసంగించారు. తాము అధికారంలోకి రాగానే ఆరు పథకాలతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామని చెప్పారు. ఒకే ఇంట్లో అవ్వ తాతకు పింఛన్ మంజూరు చేయడంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. చేవెళ్ల ప్రాణహితను దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి డిజైన్ చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. బడ్జెట్‌ను అమాంతం రూ.35 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లకు పెంచి, ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు నీటిని తరలిస్తుందని విమర్శించారు.

ఆ పార్టీలను తరిమికొట్టాలి

తెలంగాణ సంపదను కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందని, గత ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ధనిక రాష్ట్రంలో ఐదు లక్షల కోట్ల రూపాయల అప్పులు మిగిలాయని దుయ్యబట్టారు. బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని మరో 20 ఏళ్ల వెనక్కి నెట్టారని మండిపడ్డారు. మరోసారి మోసగించేందుకు సిద్ధమవుతున్న కేసీఆర్‌ను ఎన్నికల్లో తరిమికొట్టాలని ప్రసాద్‌కుమార్ అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయని, ఆ రెండు పార్టీలను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహిద్, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు రాంచ్రందారెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్రామ్ రెడ్డి, రాము నాయక్, రమేష్ నాయక్, అక్బర్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై నజర్

- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



షాబాద్: ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సాంకేతికత పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు ప్రజలను దోచుకుంటున్నారు. దీంతో పోలీసులు సైబర్ నేరాలపై దృష్టి సారించారు. ప్రజలు వారి ఉచ్చులో పడకుండా పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే లింకులు క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో చాటింగ్, కాల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

బ్యాంకు నుంచి చేస్తున్నాం

సైబర్ నేరగాళ్లు ప్రజలను సులువుగా దోచేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పంథాలో బురిడీ కొట్టిస్తున్నారు. నిరక్షరాస్యుల నుంచి విద్యావంతుల వరకు అందరి దగ్గర నుంచి డబ్బు లాగేస్తున్నారు. మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఆధార్ నంబరు చెప్పండి.. మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పండి.. మీ ఏటీఎం ఓకే చేయండి.. అంటూ వివిధ రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు.

1930 టోల్ ఫ్రీ నంబర్

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలే కాకుండా ట్రాఫిక్ నియమాలు, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దహెగాం పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పల్లెల్లో ప్రజలకు ప్రతీరోజు అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలు, ధరించకుంటే కలిగే ప్రమాదాల గురించి వాహనదారులకు తెలియజేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఎంసీఆర్‌పీలో వివరాలు అప్‌లోడ్ చేస్తే 24 గంటల్లోనే అమౌంట్ రిటన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరానికి గురైన వారు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నాం. బ్యాంకు నుంచి ఫోన్ చేశామని ఓటీపీ చెప్పాలంటూ కాల్స్ వస్తే స్పందించకూడదు. బ్యాంకు నుంచి అధికారులు ఫోన్లు చేయరు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

– యాదయ్యగౌడ్, సీఐ షాబాద్